క్లుప్తంగా

అర్హులందరికీ బ్యాంకు లింకేజీ రుణాలు



వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: డ్వాక్రా మహిళలందరికీ బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు వీలుగా వెలుగు సిబ్బంది తోడ్పాటును అందించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు కోరారు. వెలుగు ఏపీఎం, సీసీలు, సిబ్బందితో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ప్రతీ డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ తప్పనిసరిగా ఉండాలన్నారు. స్వయం ఉపాధి పొందేందుకు వీలుగా రుణాలు సహాయపడతాయన్నారు. వెలుగు సిబ్బంది క్షేత్రస్థాయిలో మహిళలను సంప్రదించి అందరికి బ్యాంకు లింకేజీ ఉండేలా చూడాలన్నారు. డ్వాక్రా మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు.

సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి: రేషన్ సేల్స్‌మన్లు ,డీలర్లు రోజూ డిపోలను తెరచి ఉంచాలని తహసీల్దార్ రామకృష్ణ ఆదేశించారు. జూన్ నుంచి ఎండీయూ వాహనాలు నిలిచిపోతున్న నేపథ్యంలో డిపోల్లో సేల్స్‌మెన్లు అందుబాటులో ఉండి వినియోగదారులకు ఇబ్బంది లేకుండా 17 రోజుల పాటు రేషన్ ఇవ్వాలన్నారు. మండల కేంద్రంలో డిపోలను ఆయన గురువారం తనిఖీ చేశారు. నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తూనికల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు.డిపో సేల్స్‌మెన్లు, డీలర్లపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ కె.రత్నరాజు, సిబ్బంది ఉన్నారు

విరిసిన బ్రహ్మకమలం



రాయపల్లిలో పూసిన బ్రహ్మకమలం

అడ్డతీగల: మండలం రాయపల్లిలో బత్తుల సత్యనారాయణ అనే వ్యక్తి ఇంటి ఆవరణలోని పూతోటలో బ్రహ్మకమలం విరిసింది. తెల్లని రంగుతో విరబూసిన ఈ పుష్పం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంది. సుదూరం నుంచి తీసుకొచ్చిన ఈ మెక్కను జాగ్రత్తగా చూసుకుంటున్నామని బత్తుల సత్యనారాయణ చెప్పారు. విరబూసిన బ్రహ్మకమలాన్ని చూసేందుకు స్థానికులు తరలివస్తున్నారు.

నిలిచిన బస్సు... ప్రయాణికుల ఇక్కట్లు




చీడిగుమ్మలలో నిలిచిపోయిన బస్సు

గొలుగొండ : నర్సీపట్నం-కృష్ణదేవిపేట మార్గంలో నర్సీపట్నం ఆర్టీసీ బస్ డిపోకు చెందిన బస్ చీడిగుమ్మల వద్ద ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 10 గంటలకు నర్సీపట్నం నుంచి బయలుదేరిన ఆర్టీసీ బస్ చీడిగుమ్మల గ్రామం వద్ద ఆగిపోయింది. దీంతో 45 మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిత్యం ఈ మార్గంలో ఆర్టీసీ సర్వీసులు ఆగిపోవడం వల్ల ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. నర్సీపట్నం నుండి వేరే బస్ రాకపోవడంతో ప్రయాణికులు ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు.

నేడు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ శిబిరం

మాడుగుల రూరల్ : స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద గల వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఉచిత శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె. అప్పారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యాపారులు, చిన్నతరహా పరిశ్రమల యజమానులు ఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. వ్యాపారులు, చిన్నతరహా పరిశ్రమలకు అధికారిక గుర్తింపు, బ్యాంకు రుణ సదుపాయాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలు, పొందడానికి ఉద్యమ రిజిస్ట్రేషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేసవి దుక్కులు ఆరంభం



పవర్‌వీడర్‌తో దుక్కి చేస్తున్న గిరిజన రైతు



బోసుబెడలో దుక్కి పనుల్లో గిరిజన రైతు

భూసారంతో అధిక దిగుబడులు

రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు

అరకులోయటౌన్: వేసవి దుక్కులతో భూసారం మెరుగుపడుతుందని వ్యవసాయశాఖ అధికారులు గిరి రైతులకు సూచిస్తున్నారు. పంటలు పండించే ముందు భూసారం పెంచుకోవాలని, వరుస పెట్టి పంటలు పండిస్తూ భూసారాన్ని విస్మరిస్తే కాలక్రమంలో ఆయా భూములు నిస్సారమైపోతాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగానే గతంలో ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంటలు పండించిన భూముల్లో వేసవి దుక్కులు చేపట్టి, భూసారాన్ని కాపాడేవారు. ఆధునిక కాలంలోని పంటలు పండించడంపై చూపిస్తున్న మక్కువ ప్రస్తుత రైతులు భూసారంపై చూపించడం లేదు. రబీ తరువాత వేసవిలో ఆయా భూముల్లో దుక్కులు చేపట్టడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. ఖరీఫ్ సీజన్ సమాయత్తమయ్యే వేళల్లో పొలాల్లో వేసవి సమయంలో దుక్కులు చేపట్టి, భూసార పరిరక్షణకు చర్యలు తీసుకునేవారు. కాలక్రమంలో అన్నదాతలు ఆధునిక పేరుతో వేసవి దుక్కులు చేపట్టడం చాలా వరకు మానేశారు. అయితే కొంతమంది గిరిరైతులు మాత్రం ఏటా వేసవి దుక్కులు చేస్తున్నారు.

ఆశాజనకంగా దిగుబడి

గిరిజన ప్రాంతంలో ఎక్కువగా మెట్ట పంటలను గిరిరైతులు సాగు చేస్తుంటారు. మెట్ట పంటల సాగులోని సామ, రాగులు(చోడి), వరి సాగులో రైతులంతా వర్షాలు కురవగానే వేసవి దుక్కులు చేస్తుంటారు. ఈ ఏడాది వేసవిలో కూడా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో గిరిరైతులు ఆనందంతో మెట్టు గరువులు, పొలాలను వేసవి దుక్కులు చేసి విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే సామలు, చోడి నారు సాగు పనులు చేపడుతున్నారు. వేసవి దుక్కులు చేసినపుడు **సేంద్రియ పదార్థలైన పశు**వుల పెంట ఇతరత్రా కషా**యాలు వేయడం** ద్వారా ఆయా భూముల్లో **భూసారం వృద్ధి చెంది,** సాగు చేసే పంటలు మంచి **దిగుబడి ఇస్తాయని వ్య**వసాయశాఖ అధికారులు **సూచిస్తున్నారు.**

వేసవి దుక్కులతో ప్రయోజనాలు

- వేసవిలో పొలాలను దుక్కి చేయడం వలన ఆయా పొలాల్లో పెరిగిన గడ్డి నశించిపోవడంతోపాటు వరి మోనలు కుళ్లి భూమిలో కలిసిపోయి ఎరువుగా మారుతాయి.
- భూమిలో ఉండే వివిధ రకాల పురుగులు బయటకు రావడం వల్ల వాటిని పక్షులు ఆహారంగా తీసుకుంటాయి. తదుపరి వేసే పంటలకు నష్టం వాటిల్లకుండా నివారిస్తాయి.
- పక్షులు ఆహారంగా తీసుకున్న తరువాత మిగిలిన పురుగులు ఎండ తీవ్రతకు చనిపోతాయి. తద్వారా ఆ పొలంలో పురుగుల ఉధృతి తగ్గుతుంది.
- తెగుళ్లకు కారణమయ్యే శిలీంద్రాలు కూడాఎండలకు చనిపోవడానికి అవకాశం ఎక్కువగా ఉంటాయి. సాగు చేసే పంటలకు తెగుళ్ల బెడద నివారించవచ్చు.
- రైతు ఇదే సమయంలో దుక్కిచేసి పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలను చల్లితే భూమిసారాన్ని కూడా పెంపొందించు ుకునే అవకాశం ఉంటుంది.

పంటకు మేలు



మా తాతల కాలం నుంచి వేసవి దుక్కులు చేస్తున్నా. వేసవిలో తొలకరి వర్షం కురవగానే పొలాలో దుక్కి పనులకు సిద్ధమవుతుంటాం. పంటవేసే సమయంలో మరోసారి దుక్కి దున్ని పశువుల పెంట వేస్తుంటాం. దీని వలన పంట దిగుబడి బాగా ఉంటుంది. సాగు చేసే అన్ని రకాల పంటకు ఎంతో మేలు జరుగుతుంది.

– శెట్టి కొండప్పు, గిరిరైతు, బోసుబెడ గ్రామం, అరకులోయ మండలం

దుక్కులతో భూసార పరిరక్షణ



పంట పొలాల్లో విరామం లేకుండా పంటలు పండిస్తూ పోతుంటే వాటిలో భూసారం కరిగిపోతోంది. ఈ సమస్యను నివారించేందుకు పొలాల్లో వేసవి దుక్కులు చేపట్టడం ఎంతో అవసరం. రబీ పంట తరువాత పొలాల్లో వేసవి దుక్కులు చేయడం వల్ల చీడ పురుగులు, శిలీంద్రాలు చనిపోతాయి. గడ్డి గరప కుళ్లి నేల సారవంతంగా తయారవుతుంది. వేసవి దుక్కులు చేసిన పొలాల్లో తెగుళ్ల బెడద చాలా వరకు ఉండదు. ఫలితంగా పంటల దిగుబడులు బాగుంటాయి.

– ఫణి రాజ్ వర్మ, ఏఓ, అరకులోయ మండలం

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



చాపరాయిలో హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ పాపినాయుడు

డుంబ్రిగుడ: ప్రమాదాల నివారణకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని డుంబ్రిగుడ ఎస్ఐ కె. పాపినాయుడు అన్నారు. మండల కేంద్రంతో పాటు పర్యాటక ప్రదేశం చాపరాయి జలపాతంలో గురువారం వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులతో ఆయన మాట్లాడుతూ హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. మనిషికి ప్రధానమైన తల భాగంలో దెబ్బలు తగలకుండేందుకు హెల్మెట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

పాడేరు ఎమ్మెల్యే పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: మండలంలో పెదలోచలి పంచాయతీ కేంద్రంలో మాజీ సర్పంచ్ బోడిగి వెంకటస్వామి గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకొన్న పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు తదితరులు మాజీ సర్పంచ్ వెంకటస్వామి పార్థీవ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండం నాయుడు, సర్పంచ్ బొడిగి చినకుమారి, పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పండన్న, నియోజకవర్గం వలంటీర్ల సంఘం అధ్యక్షుడు కూర్మరాజు, నాయకులు తదితరలున్నారు.

రహదారికి ఇరువైపులా ఆక్రమణల తొలగింపు



చింతలవీధిలో ఆక్రమణలను తొలగిస్తున్న ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు, పోలీసులు

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రం పాడేరుతో పాటు సమీప ప్రధాన రోడ్లలో అక్రమణల తొలగింపు చర్యలను రెవెన్యూ, ఆర్అండ్‌బీశాఖలు గురువారం ప్రారంభించాయి. చింతలవీధి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ప్రభుత్వ భూముల్లో పునాదులు, పిల్లర్లను అక్రమ నిర్మాణాలను గుర్తించిన అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. నోటీసులు ఇచ్చినా ఆక్రమణదారుల్లో స్పందన లేకపోవడంతో వాటిని ప్రొక్లెయినర్‌తో తొలగించారు. తహసీల్దార్ వంజంగి త్రినాథరావునాయుడు, ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరబాబుతో పాటు పోలీసుల పర్యవేక్షణలో ఆక్రమణలను తొలగింపు పనులు జరిగాయి. ఈ సందర్భంగా తహసీల్ద్రార్ త్రినాథరావునాయుడు మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా థాక్రమణలను గుర్తించి నోటీసులు ఇస్తున్నామని, స్వచ్ఛందంగా తొలగించని పక్షంలో తామే యంత్రాలతో తొలగిస్తామని హెచ్చరించారు. శనివారం పాడేరు పట్టణంలోని పాతబస్టాండ్ నుంచి సినిమాహాల్ సెంటర్ వరకు ఆక్రమణల తొలగింపు పనులు జరుగుతాయన్నారు.



ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న తహసీల్దార్ నర్సమ్మ

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో రహదారికి ఇరువైపులా అక్రమణలను వెంటనే తొలగించాలని తహసీల్దార్ నర్సమ్మ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రహదారి విస్తరణలో భాగంగా దుకాణ, గృహ యజమానులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నర్సమ్మ మాట్లాడుతూ మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ స్థలాలను ఆక్రమించి, దుకాణాలు, గృహాల ముందు రేకుల షెడ్లను, ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటుచేశారని, వాటిని స్వచ్ఛందంగా తొలగించాలన్నారు. ఈ మేరకు ఇప్పటికే 180 మందికి నోటీసులు అందించామని, ఆక్రమించి, నిర్మించిన షెడ్లను వచ్చే నెల 4వ తేదీలోగా తొలగించాలని, రహదారి విస్తరణకు అందరూ సహకరించాలన్నారు. లేనిపక్షంలో పొక్లెయిన్‌తో ఆక్రమించిన స్థలంలో ఉన్న షెడ్లను తొలగిస్తామని ఆమె హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నేతలు, వ్యాపారులు, దుకాణ, ఇళ్ల యజమానులున్నారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలని వినతి



గ్రామ సచివాలయం అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

వి.ఆర్.పురం: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయాలని, ఏజెన్సీలో ఉపాధ్యాయ పోస్టులను ఆదివాసీలతోనే భర్తీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని రేఖపల్లి, రాజుపేట, వడ్డుగూడెం గ్రామ సచివాలయాల ముందు గురువారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏజెన్సీలో జీవో నెంబరు-3కు చట్టబద్ధత కల్పిస్తామని, ప్రత్యేక డీఎస్సీ ద్వారా గిరిజన అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక డీఎస్సీ, జీవో నెంబరు-3 పునరుద్ధరణ కోసం ఏజెన్సీ వ్యాప్తంగా గిరిజనులు ఉద్యమాలు చేస్తున్నా కూటమి ప్రభుత్వం కనీసం స్పందించడం లేదన్నారు. ఈ సందర్భంగా ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలుచేయాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు తదితరులు వినతిపత్రాన్ని సచివాలయాల అధికారులకు అందజేశారు. నాయకులు బాబూరావు, చినబాబు, రాజు, శ్రీరామ్మూర్తి, రామారావు, కన్నయ్య, మల్లయ్య, కాంతారావు, గౌతమ్ పాల్గొన్నారు.

మహానాడు వేదికపై కిడారి వ్యాఖ్యలు హాస్యాస్పదం

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు

ముంచంగిపుట్టు: మహానాడు వేదికపై జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు విమర్శించారు. పార్టీ నాయకులతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రావణ్ అబద్ధాలు చెబుతూ, వాస్తవాలను కప్పిపుచ్చేలా ప్రసంగించడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాంతం అభివృద్ధి పథంలో పయనించిందని, ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్క సంక్షేమ పథకం కూడా గిరిజనులకు అందలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, ఎంతో చేసినట్టు మహానాడు వేదికగా మంత్రులు, చైర్మన్లు గొప్పలు చెప్పుకోవడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. చంద్రబాబు, లోకేష్‌ల మెప్పు కోసం కిడారి శ్రావణ్ బాక్సైట్, జీవో నంబర్ 3పై వాస్తవాలను పక్కన పెట్టి ప్రసంగించారని పద్మారావు దుయ్యబట్టారు. ఇదంతా గిరిజన లోకం గమనిస్తుందని, తగిన గుణపాఠం తప్పదని, వాస్తవాలు మాట్లాడడం అలవాటు చేసుకోవాలని కిడారికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జర్జుల వైస్ సర్పంచ్ సాధురాం, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

కె.కోటపాడు : ఆర్లి గ్రామస్తులు మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం అత్యంత వైభవంగా జరిపారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. మహిళలు పసుపు, కుంకుమ, చీరలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. గ్రామమంతా విద్యుద్దీప అలంకరణ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రెండు మోడల్ పాఠశాలలు ఎంపిక

అడ్డతీగల: అడ్డతీగల మండలంలో 2025-26 విద్యాసంవత్సరానికి రెండు మోడల్ పాఠశాలలుగా ఎంపిక చేసినట్టు ఎంఈవో పి.శ్రీనివాసరావు తెలిపారు. తాము ఉన్నతాధికారులకు పంపించిన నివేదికలు ఆధారంగా ప్రభుత్వం అధికారికంగా ఆయా పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అడ్డతీగల, దుశ్శర్తి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. అడ్డతీగల పాఠశాలలో 65 మంది, దుశ్శర్తి పాఠశాలలో 105 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. ఆయా పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు ఒక ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంతో పాటు నలుగురు చొప్పున ఉపాధ్యాయులు కేటాయించనున్నట్టు తెలిపారు. దీంతో విద్యాబోధన మరింత మెరుగుపడుతుందన్నారు. తరగతి గదుల్లో మరిన్ని సౌకర్యాలు అందుబాటులోనికి వస్తాయని, మౌలిక వసతులు కల్పిస్తారన్నారు.అదనపు భవనాలు నిర్మిస్తారన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



రామారావు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

రాజవొమ్మంగి: రంపచోడవరం, మారేడుమిల్లి గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా గల ఆక్రమణలను తొలగిస్తున్న మాదిరిగానే డివిజన్‌లోని మిగిలిన అన్ని మండలాల్లో కూడా చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలో చూసినా రోడ్లకు ఇరువైపులా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారే వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ఆయా మండలాల్లో చాలా ఏళ్లుగా నివసిస్తున్న ఆదివాసీలు కూడా చిన్న చిన్న దుకాణాలు పెట్టుకొని జీవనోపాదులు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకొన్న వారిపై అధికారులు తీసుకొంటున్న చర్యలను స్వాగతిస్తున్నామని రామారావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మోదకొండమ్మ పండగకు ముమ్మర ఏర్పాట్లు

మాడుగుల : మాడుగుల మోదకొండమ్మ పండగ వచ్చే నెల 3వ తేదీన జరగనున్న సందర్భంగా మాడుగుల వీధుల్లో విద్యుత్ అలంకరణకు భారీ స్థాయిలో సెట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. పండగలో సుమారు లక్ష మంది రానున్నారని ఆలయ కమిటీ అంచనా వేస్తుంది. దీంతో ఆ దిశగా ఆలయ కమిటీ ఏర్పాట్లు సిద్ధం చేస్తుంది.

ఘనంగా మోదమాంబ సారె ఊరేగింపు



ఊరేగింపులో భక్తులు

మాడుగుల రూరల్ : మోదమాంబ మాలాధారణ భక్తులు వీరవల్లి అగ్రహారం గ్రామంలో గురువారం సారె ఉరేగింపు నిర్వహించారు. స్వీట్లు, అరటిపండ్లు, తాటికాయల గెలలు, కొబ్బరికాయలతో సారెను ఊరేగించి అమ్మవారి ఆలయానికి వెళ్లి సారె నివేదించారు. భక్తులు పెద్ద ఎత్తున సారె ఊరేగింపులో పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



బోరు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ పార్తిమ్మ, ఎంపీటీసీ విజయలక్ష్మి

ముంచంగిపుట్టు: పంచాయతీలోని గ్రామాల్లో తాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు జర్జుల సర్పంచ్ డి.పార్తిమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వి.విజయలక్ష్మి చెప్పారు. మండలంలోని జర్జుల పంచాయతీ టంకపుట్టు గ్రామంలో పీఎం జన్‌మన్ ద్వారా మంజూరైన నూతన బోరు పనులను వారు గురువారం ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పార్తిమ్మ, ఎంపీటీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో తాగునీటి బోర్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, వైస్ సర్పంచ్ సాధురాం, పంచాయితీ కార్యదర్శి నీలకంఠం, ఎంఆర్‌సీ గణపతి, గ్రామస్తుడు నాయుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరుపై నిరుద్యోగుల వినూత్న నిరసన

మర్రిపాలెంలో గిరిజన నిరుద్యోగుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న నిరుద్యోగులు

కొయ్యూరు: గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీని నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గిరిజన నిరుద్యోగులు గురువారం భిక్షాటన చేశారు. జీవో నంబర్-3 రద్దు అనంతరం ప్రత్యామ్నాయంగా జీవో రాకపోవడంతో ఇప్పుడు డీఎస్సీలో వందలాది మంది గిరిజన నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ మర్రిపాలెంలో ప్రతీ షాపులో తిరిగి భిక్షాటన చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ప్రత్యేక డీఎస్సీని గిరిజనుల కోసం ప్రకటించాలని సూచించారు. నిరుద్యోగుల అవస్థలు గమనించాలని కోరారు.

నోరూరిస్తున్న వాటర్ యాపిల్



రాజవొమ్మంగిలో విక్రయిస్తున్న వాటర్ యాపిల్స్

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని మార్కెట్‌లో ఎర్రని రంగులో ఉన్న వాటర్ యాపిల్స్ అందరిని ఆకట్టుకుంటున్నాయి. జోరుగా అమ్మకాలు సాగుతున్నాయి. వీటిని పండించిన రైతు డజను కాయలు రూ. 20లకు విక్రయించారు. హాట్ కేకుల్లా అవి అమ్ముడయ్యాయి.

ఎర్రని రంగులో నోరూరించే ఈ పండ్లు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం, అమలాపురం ప్రాంతాల్లో పండిస్తున్నారు. తియ్యటి రుచి ఉండే ఈ పండు వర్షాకాలంలోనే మార్కెట్‌లో లభిస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఏ, సీ విటమిన్‌లతో పాటు కాల్షియం, ఐరన్ వంటి పోషక విలువలున్న ఈ పండు ఆరోగ్యానికి మంచిదని వైద్యులు చెబుతున్నారు. మధుమేహం, అధిక రక్తపోటు, జీర్ణ సమస్యతో ఉన్నవారికి ఈ పండు మంచి ఔషధంగా పనిచేస్తుందని చెబుతున్నారు. తియ్యని రుచి కలిగి జీడిమామిడిని పోలిన ఈ పండ్లు ప్రస్తుతం మార్కెట్‌లో బాగా అమ్ముడవుతున్నాయి.

విద్యార్థులకు పద్య పఠన పోటీలు

కె.కోటపాడు : చౌడువాడ శాఖా గ్రంథాలయం వద్ద విద్యార్థులకు గురువారం పద్య పఠన పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా వేమన శతకాలకు సంబంధించి పద్య పఠన పోటీలు నిర్వహించారు. పద్యాలతో పాటు భావాలను కూడా విద్యార్థులతో చెప్పించారు. విజేతలకు వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు రోజున బహుమతులు అందజేయడం జరుగుతుందని గ్రంథాలయాధికారి పద్మావతి తెలిపారు.